క్లుప్తంగా

ధర్పల్లి తహసీల్దార్‌గా శాంత



ధర్పల్లి: ధర్పల్లి నూతన తహసీల్దార్‌గా టి. శాంత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దార్‌గా పనిచేసిన మాలతి మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో చందూర్ తహసీల్దార్‌గా పనిచేసిన శాంత ధర్పల్లికి బదిలీపై వచ్చారు. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. రైతులకు ఎలాంటి భూ సమస్యలున్నా తనను సంప్రదించాలని ఆమె సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఆర్ఐ రాజేశ్వర్, రవి, సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవార్డుల ప్రదానం



పురస్కారం అందుకుంటున్న రవీందర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్, బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రులను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్ షా శుక్రవారం సందర్శించారు. అనంతరం అత్యున్నత సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించారు. లయన్స్ క్లబ్(ఇందూరు) రాష్ట్ర అదనపు కార్యదర్శి కరిపే రవీందర్ కూడా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కరిపే రవీందర్ మాట్లాడుతూ.. తనకు అవార్డు అందించిన మనోజ్ షా, బాబూరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బసవేశ్వర్ రావులకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ సభ్యులు కొడాలి కిశోర్, శ్రీనివాస రావు, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

అహ్మదీబజార్‌లో ట్రాఫిక్ క్లియర్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మదీబజార్‌లో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు. నగరంలోని ఆహ్మదీబజార్‌లో రోడ్డు దగ్గరగా ఉండి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లు, కోకాలను లోపలికి జరిపించారు. వాహనదారులు, షాపులకు వచ్చేవారికి ఇబ్బందులు తొలిగించామని ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

రిటైర్డ్ ఆర్టీవో శివచరణ్‌కు నివాళులు

ఖలీల్‌వాడి: నగరంలోని గాజులపేట్‌కు చెందిన రిటైర్డ్ ఆర్టీవో, విజయ్ కిసాన్ మున్నూరుకాపు సంఘం మాజీ అధ్యక్షుడు శివచరణ్ మృతిపట్ల మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శివచరణ్ ఇంటి వద్ద ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. శివచరణ్‌తో చిన్ననాటి జ్ఞాపకాలు ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

వెకేషన్ బైబిల్ స్కూల్ ప్రారంభం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చి(ఆచన్‌పల్లి)లో శుక్రవారం వెకేషన్ బైబిల్ స్కూల్‌ను చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ ప్రారంభించారు. వెకేషన్ బైబిల్ స్కూల్ రెండు రోజులపాటు ఉద యం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని ఫాదర్ తెలిపారు. ఈ స్కూల్‌లో పిల్లలకు బైబిల్‌లోని ఏసు బోధనలు నేర్పించడంతో పాటు ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యమాలు నేర్పిస్తామని వెల్లడించారు. ఫాదర్ స్టీఫెన్, పాస్టర్ రవి, చర్చి కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్, సీమాన్, సంపత్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రికార్డుల తనిఖీ



బోధన్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలని వారికి సూచించారు. రాజీవ్ యువవికాస్ పథకంలో లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. హరితహారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు బాల గంగాధర్, మధుకర్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత..తీరేనా చింత?



ఆర్వోబీ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు



బురదమయంగా మారిన వాహనాలు వెళ్లే రోడ్డు

- భారీ వర్షంతో గుంతలుగా మారిన మాధవనగర్ ఆర్వోబీ రోడ్డు
- రాత్రివేళ ప్రమాదకరంగా ప్రయాణం
- గుంతలు పూడ్చాలని కోరుతున్న వాహనదారులు
- నత్తనడకన సాగుతున్న ఆర్వోబీ పనులు
- ఎప్పుడు పూర్తవుతుందో తెలియని స్థితి?

నిజామాబాద్ రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయమేర్పడుతోంది. ద్విచక్రవాహనదారులు ఏ గుంతలో పడతామేమోనని భయపడుతున్నారు. రైలు వచ్చినప్పుడైతే ప్రయాణికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని నానా అవస్థలు పడుతున్నారు. వర్షానికి శుక్రవారం సాయంత్రం 20 నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఆర్వోబీ పనులు ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా నిర్మాణం పూర్తి కాలేదు. పనులు నత్తనడకన సాగుతున్నాయి.

రాత్రి వేళ చిమ్మ చీకట్లు..

ఆర్వోబీ నిర్మాణం వద్ద లైటింగ్ లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాల బారిన పడిన ఘటనలున్నాయి. అదేవిధంగా బైపాస్ గుండా వెళ్లే వాహనాలు సైతం ఆర్వోబీ కింద నుంచి వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వర్షం కారణంగా ప్రస్తుతం ఆర్వోబీ పనులు నిలిచిపోయాయి. కేవలం మొరం పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఆర్వోబీ పూర్తి కావడానికి ఇంకా రెండేళ్లు పడుతుందని ప్రాజెక్టు ఇంజినీర్లు చెబుతున్నారు. దాదాపు రూ.93.12 కోట్ల వ్యయంతో ఆర్వోబీ చేపడుతున్నారు. నిర్మాణం ఆలస్యం కావడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి.

ఇబ్బందులు కలుగకుండా చూడాలి

మాధవనగర్ ఆర్వోబీ పనులు ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు గడిచాయి. ప్రయాణికులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. అధికారులు వెంటనే స్పందించి వర్షాకాలం ప్రారంభం కాకముందే రోడ్డు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నాం.

– హరి, మాధవనగర్‌వాసి

ప్రమాదాలకు గురవుతున్నారు

చిన్నపాటి వర్షానికే ఆర్వోబీ వద్ద ఉన్న రోడ్డు చిత్తడిగా మారుతోంది. రోడ్డంతా గుంతలు పడ్డాయి. రాత్రివేళ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ముందుగా అధికారులు రోడ్డును పునరుద్ధరించి వాహనదారులు ప్రమాదాల బారినపడకుండా చర్యలు తీసుకోవాలి.

– సోమయ్య, ప్రయాణికుడు





పిల్లర్ల దశలో ఆగిన పనులు.. నిలిచిన వర్షపు నీరు



రాత్రివేళ ఆర్వోబీ వద్ద ప్రమాదకరంగా ప్రయాణం

ఘనంగా చర్చి వార్షికోత్సవం



గీతాలు ఆలపిస్తున్న స్త్రీల మైత్రి సభ్యులు

డిచ్‌పల్లి: మండలంలోని సీఎస్ఐ వెస్లీ చర్చి 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ జి.దినకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నిజామాబాద్ ప్రెసిబిటర్ సీహెచ్ జార్జి ముఖ్య ప్రసంగం చేశారు. సంఘంలో దేవుని పిల్లలు సామాజికంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా వర్ధిల్లాలని, విశ్వాసులు తమ హృదయాలను ఆలయంగా మార్చుకుని దేవుని ఆరాధించాలని సూచించారు. చర్చిపై స్త్రీల మైత్రి సభ్యులు ప్రత్యేక గీతం ఆలపించారు. వేడుకల్లో రెవరెండ్ బి.ప్రకాశ్, రెవరెండ్ బి.ప్రవీణ్, పాస్టర్ రాజు, పెద్దలు సామేల్, పద్మారావు, దేవరాజ్, భూమయ్య, ప్రవీణ్, మోహన్, సీమెన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు ఆందోళన చెందొద్దు



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: వర్షాల వల్ల ధాన్యం తడిసిన అన్నదాతలు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండలం నల్లూర్‌లో వర్షాల వల్ల తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇది వరకే జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు. రైతుల విషయంలో రాజకీయాలు తగవన్నారు. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, తదితరులున్నారు.

మారుతి మందిర్ దుకాణాల లీజ్‌కు వేలంపాట



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్: పట్టణంలోని మారుతి మందిర్ కాంప్లెక్స్‌లో గల దుకాణాల లీజ్‌కు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. మారుతి మందిర్ కాంప్లెక్స్‌లోని రెండు దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించగా 5వ నెంబర్ దుకాణాన్ని కాళిదాసుచారి రూ.7,100లు, 6వ నెంబర్ దుకాణాన్ని బొప్పాపురం హన్మాండ్లు రూ.7,200లు నెలవారీ అద్దెతో అత్యధికంగా వేలంపాట ద్వారా దక్కించుకున్నట్లు ఈవో రాములు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో రాములు, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ పట్వారి, అర్చకులు ప్రవీణ్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఏర్పాటు



ఎన్నికైన మాల మహానాడు మండల కమిటీ సభ్యులు

మాక్లూర్: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కా దేవిదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు మాక్లూర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బేగరి రవి, కార్యదర్శిగా నీరడి శంకర్, కోశాధికారిగా డీసీ గంగాధర్, ఉపాధ్యక్షులుగా తిర్మన్‌పల్లి భోజన్న, ఆసది ఒడ్డెన్న, బి.రవిని ఎన్నుకున్నారు. కులస్తులందరి అభిప్రాయం తీసుకుని సంఘ అభివృద్ధికి పాటు పడుతామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, చింతల మోహన్, భోజన్న, రవి, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైపుణ్యాలకు పదును పెట్టాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

బోధన్: ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాలకు పదును పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షుడు ఎంబెల్లి శంకర్, ప్రతినిధులు ఖైరాన్, గంగాధర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణలో భాగంగా స్థానిక తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్‌లో తర్ఫీదు ఇచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్ ఆవరణలో విద్యార్థులకు ఉపాధ్యాయ నేతలు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకునేందుకు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అకాడమీ డైరెక్టర్ లింబూరి లక్ష్మణ్, డ్రాయింగ్ బోధకులు ఎర్రోల్ల అవంతి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో అమృత మిత్రలు



అమృతమిత్రలకు ట్రీ ఫర్ ఉమెన్ కిట్‌లు అందజేస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో చెరువుల వద్ద మొక్కలు నాటడం, వాటర్ ట్యాంక్‌ల పరిశీలన బాధ్యతలు అమృత మిత్రలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని కాలూరు చెరువు వద్ద ట్రీస్ ఫర్ ఉమెన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలూరు చెరువు, రామర్తి చెరువు వద్ద అమృత మిత్రలు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, ఏఈ పావని, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



తాటిపల్లిలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: మండలంలోని న్యావనంది, తాటిపల్లి, హుస్సేన్‌నగర్ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారుడు త్వరగా పనులను ప్రారంభించాలని నాయకులు సూచించారు. నాయకులు ఉమ్మాజీ నరేష్, ఏఎంసీ డైరెక్టర్ ముత్తెన్న, జనార్దన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, బన్నాజీ, అంబర్‌సింగ్, నరేందర్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పట్వారీ తులసి కుమార్, నర్సింహ నాయుడు

పెర్కిట్(ఆర్మూర్): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జాతీయ అవార్డు గ్రహీత, ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్ హితవు పలికారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడితో కలిసి తులసి కుమార్ డ్రగ్స్ నియంత్రణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తులసి కుమార్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వలమైన భవిష్యతును నాశనం చేసుకోవద్దని సూచించారు. నేతలు రుక్మాజి, సురేష్, నరేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ



ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిచ్‌పల్లి తహసీల్దార్ సతీష్‌రెడ్డి



మొక్క అందజేస్తున్న జిల్లా సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ దశరథం

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లి తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన కె.సతీష్‌రెడ్డి శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే సారంగాపూర్‌లో గల జిల్లా సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన చింతల దశరథం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. మొక్కను బహూకరించారు.

అటవీ సంపదను దోచుకోడానికే ఎన్‌కౌంటర్లు



మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకులు రమేష్

సిరికొండ: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఉన్న విలువైన అటవీ సంపదను దోచుకోవడానికే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తోందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు రమేష్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విలువైన అటవీ సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అప్పగించడం కోసం అడవిని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలను, వారి కోసం పని చేస్తున్న మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. మావోయిస్టులను, ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్ చేయడం సిగ్గుచేటన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని చెప్పడం శోచనీయమన్నారు. నేతలు కిషోర్, దామోదర్, లింబాద్రి, రమేష్, కిషోర్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'కు ఉపాధ్యాయుల మద్దతు



మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ జెండాతో ఎంఈవో, ఉపాధ్యాయులు

మోపాల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు మోపాల్ మండల ఉపాధ్యాయులు శిక్షణ విరామ సమయంలో గురువారం సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా మోపాల్ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ జెండా పట్టుకుని పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా, భారత్‌కు అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎంఈవో గేమ్‌సింగ్ మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి భారత సైన్యం, ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకుందని వ్యాఖ్యానించారు. టీటీయూ జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి దేవిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ ఉత్సవాలు

ఇందల్వాయి: సిర్నాపల్లిలో గంగమ్మ ఆలయ ఉత్సవాలను గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగించి గంగమ్మ తల్లికి అభిషేకాలు చేశారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో పాటు మత్స్య సంపద సమృద్ధిగా ఉండాలని పూజలు చేశారు. వీడీసీ, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
జిర్నిసుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 ఏస్(తెలుగు)-1.30, 7.35
- మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.30, 10.30
- స్క్రీన్-2 ఒక బృందావనం(తెలుగు)-11.00
- నిశ్శబ్ద ప్రేమ(తెలుగు)-4.30
- సింగిల్(తెలుగు)-1.30, 7.30, 10.30
- స్క్రీన్-3 ఒక బృందావనం(తెలుగు)-4.30, 10.20
- లిలో అండ్ స్టిచ్(ఇంగ్లీష్ 3డీ)-1.30 , 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్ -10.10, .25, 10.40 సింగిల్(తెలుగు)-1.40, 7.55
- స్క్రీన్-2 లిలో అండ్ స్టిచ్(3డీ తెలుగు)-11.30,2.00
- ఏస్(తెలుగు)-4.30, 10.20
- ఒక బృందావనం(తెలుగు)-7.40
- స్క్రీన్-3 భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.35, 8.00, 10.40
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-2.15
- హిట్(తెలుగు)-4.45
- స్క్రీన్ -4 వీరరాజు-1991(తెలుగు)-11.00
- వర్షం(తెలుగు)-1.40 -శుభం(తెలుగు)-7.30
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-5.00, 10.10

లలితామహల్ యమదొంగ **దేవి** సింగిల్
నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్ **విజయ్** హిట్